క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు



పుస్తకాలను ప్రదర్శిస్తున్న గ్రంథాలయాధికారి సూర్యకళ, విద్యార్థులు

సింహాచలం: పెందుర్తి గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని గ్రంథాలయాధికారి బి.సూర్యకళ తెలిపారు. అర్థమెటిక్, రీజనింగ్, ఇండియన్ హిస్టరీ, ఏపీ హిస్టరీ, ఎన్విరాన్మెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇండియన్ జాగ్రఫీ, పోస్టుమాన్ అండ్ మెయిల్ గార్డ్, గ్రూప్–1 నుంచి గ్రూప్–4 వరకు, ఎన్సీఆర్టీ పుస్తకాలు, హైటెక్ విజయ రహస్యం తదితర 99 పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు, పాఠకులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులతో కలిసి సూర్యకళ పుస్తకాలను ప్రదర్శించారు.

వార్షిక కల్యాణోత్సవానికి అశోక్‌కు ఆహ్వానం



అశోక్‌గజపతిరాజుకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ప్రధానార్చకుడు, ఈఈ

సింహాచలం: వచ్చేనెల 2వ తేదీన జరగనున్న వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవానికి సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పూసపాటి అశోక్‌గజపతిరాజుకు బుధవారం దేవస్థానం అధికార, వైదికులు ఆహ్వానం పలికారు. విజయనగరంలోని ఆయన స్వగృహానికి వెళ్లిన దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ శ్రీనివాసరాజు అశోక్‌గజపతికి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బండారు దివంగత ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: సబ్బవరం మూడు రోడ్ల కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ముందుగా పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్‌చేసి ఒకరికి ఒకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మిడతాన మహాలక్ష్మినాయుడు, గండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: టీడీపీ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని అడవివరంలో ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్ల స్టాండ్ వద్ద పార్టీ జెండాను టీడీపీ 98వవార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, సతివాడ శంకరరావు ఆవిష్కరించారు.

మహిళా సంక్షేమానికి సీఎం పెద్దపీట



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, డ్వాక్రా మహిళలు



సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- ఘనంగా ఆసరా మూడో విడత సంబరాలు

పరవాడ: మహిళా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పరవాడలో బుధవారం మూడోవిడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అదీప్‌రాజ్ డ్వాక్రా మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. పరవాడ మండలానికి మూడో విడత కింద మంజూరు చేసిన రూ.12.90 కోట్ల చెక్కును ఎమ్మెల్యే అదీప్‌రాజ్ డ్వాక్రా మహిళలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్ రాజ్

టీడీపీ మోసం చేసింది

2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పొదుపు సంఘాలకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోకపోవడంతో పొదుపు సంఘాలు డిఫాల్టుగా మారాయన్నారు. ప్రజా సంకల్పయాత్రలో అక్క చెల్లెమ్మల బాధలను కళ్లారా చూసిన వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే రుణ మాఫీ చేస్తానని ఇచ్చిన హామీ మేరకు అధికారం చేపట్టిన వెంటనే రుణమాఫీ దశల వారీగా చేస్తున్నారని చెప్పారు.

నియోజక వర్గంలో 45,324 మంది లబ్ధిదారులు

పెందుర్తి నియోజకవర్గం పరిధిలో 5,319 స్వయం సంఘాల్లో ఉన్న 45,324 పేద మహిళలకు మూడో విడతగా రూ.53.08 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పరవాడ మండలానికి మూడు విడతలుగా రూ. 38.90 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని చెప్పారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇంటికే పింఛన్లు అందజేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగనన్ననే సీఎంగా గెలిపించడానికి అక్కచెల్లెమ్మలు అండగా నిలవాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. సమావేశంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఏపీఎం కనకమ్మ, ఉప సర్పంచ్ బి.రామారావు, ఎం.ఎస్.ఎం.ఈ డైరెక్టర్ నదియా, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పైల అప్పలనాయుడు, సర్పంచులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు అండగా ఉంటా..



తాత, తండ్రి పేరిట నిర్మించిన గదిని ప్రారంభిస్తున్న ద్రోణంరాజు శ్రీవాత్సవ


సింహాచలం: పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడలో బ్రాహ్మణ సంఘం భవనాన్ని శనివారం ద్రోణంరాజు శ్రీవాత్సవ సందర్శించారు. భవనంలో తన తాతయ్య ద్రోణంరాజు సత్యనారాయణ, తండ్రి ద్రోణంరాజు శ్రీనివాస్ పేరిట కట్టిన గదిని ఆయన ప్రారంభించారు. బ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో పలు అంశాలపై చర్చించారు. ఏ అవసరమొచ్చినా తనను సంప్రదించవచ్చని తెలియజేశారు. తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కోటేశ్వరరావు, సూర్యప్రతాప్, ఎస్‌వీఆర్ మూర్తి, చంద్రశేఖర్, సాయిప్రసాద్, భారతి పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చాలి'

ఉక్కునగరం: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) స్టీల్ సిటీ డిపో అధ్యక్షుడు జి.ఎస్.ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ రీజనల్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జరిగిన గేటు మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. నాయకులు ఈశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి

- ముస్తాబైన రామాలయాలు



సింహగిరిపై పురాతన రామాలయంలో సీతారాముల ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీరామనవమిని పురస్కరించుకుని రామాలయాలు ముస్తాబయ్యాయి. గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సింహగిరిపై ఉన్న పురాతన రామాలయంతో పాటు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన సీతారాముల మందిరంలో ఉదయం 10.30 నుంచి సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు సింహాచలం దేవస్థానం వైదిక, అధికారులు ఏర్పాట్లు చేశారు.

- 98వ వార్డు సింహపురికాలనీ, అడవివరం, రాజవీధి, విజినిగిరిపాలెంలలో ఉన్న రామాలయాల్లో సీతారాముల కల్యాణం విశేషంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.



శాంతినగరంలో సీతారాములకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

- 93వవార్డు పరిధి నరసింహనగర్‌లోని గోపీ జనవల్లభస్వామి ఆలయంలో సాయంత్రం 6.30 గంటల నుంచి సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

విశేషంగా అభిషేకం

చినముషిడివాడలోని శాంతినగరం సీతారామాలయంలో ఈనెల 22వతేదీ నుంచి 31వతేదీ వరకు నిర్వహించనున్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం సీతారాములకు పంచామృతాభిషేకం, అష్టోత్తరశత కలశాభిషేకం, సహస్ర నామార్చన పూజలు చేశారు. సాయంత్రం అర్చనలు, విశేష హోమాలు, సీతారాముల శోభాయాత్ర విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం ఉదయం 7గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, 9.30గంటలకు లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ, 10 గంటల నుంచి సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



పరవాడ రామాలయంలో కొలువుదీరిన సీతారాములు

పరవాడలో..

పరవాడ: శ్రీరామనవమి ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించేందుకు పలు గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు. పరవాడ, వాడచీపురుపల్లి, ఈ.బోనంగి, తానాం, పి.బోనంగి, భర్నికం, మంత్రిపాలెం, పెదముషిడివాడ, గొర్లివానిపాలెం, లంకెలపాలెం, సాలాపువానిపాలెం, తాడి, వెన్నలపాలెం, కలపాక, దలాయిపాలెం, రావాడ గ్రామాల్లోని రామాలయాలను ముస్తాబు చేశారు. గురువారం వేకువ జాము ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. పలు గ్రామాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సీతారాముల కల్యాణం అనంతరం ఆలయాల ప్రాంగణంలో భారీ అన్నసమారాధనలు నిర్వహించనున్నారు.

ప్రజలకు చేరువగా వైద్యం

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- 104 వాహనం ప్రారంభం



జెండా ఊపి 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మానసపుత్రికగా చెప్పుకునే వైద్య రంగాన్ని మరో రెండు అడుగులు ముందుకు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు మరింత చేరువచేయడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం అందించిన 104 వాహనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య,వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుందన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా కరోనాను కూడా ఆరోగ్య శ్రీలో చేర్చి వైద్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి మొదలు పెట్టిన ఆరోగ్యశ్రీ,104 లను గత ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయన్నారు. ప్రజలకు మరింతగా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్టు తీసుకువచ్చామన్నారు. గతంలో సబ్బవరం మండలంలోని రెండు పీహెచ్‌సీలకు ఒకే 104 వాహనం ఉండగా ఇప్పుడు రెండో వాహనం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు,సబ్బవరం ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, యర్ల నాయుడు, బంతికోళ్ల పద్మ, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పల్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్ స్కీమ్ పనులు వేగవంతం చేయండి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో రూ.54.04కోట్లతో ప్రసాద్ స్కీమ్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సూచించారు. ప్రసాద్‌స్కీమ్ పనులకు సంబంధించి ఇటీవల ఫైనల్ డీపీఆర్ సిద్ధం చేసిన విషయం తెలిసిందే. పనుల ప్రణాళికను బుధవారం సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ స్వామీజీకి అందజేశారు. త్వరితగతిన టెండర్లు పిలిచి ఏడాదిలోపు పనులు పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని స్వామీజీ ఈ సందర్భంగా సూచించారు. ఈ పనులు పూర్తయితే దేవస్థానంలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని స్వామీజీ సంతృప్తి వ్యక్తం చేశారు.



స్వరూపానందేంద్ర సరస్వతికి ప్రసాద్ స్కీం డీపీఆర్ అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దినేష్‌రాజ్

సుకన్య సమృద్ధి యోజనపై విస్తృత అవగాహన

ఎంవీపీ కాలనీ: ఆడపిల్లల భవిష్యత్ ఆర్థిక భరోసా కోసం కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సుకన్య సమృద్ధి యోజన పథకంపై రీజనల్ పోస్టల్ కార్యాలయం ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కల్పించారు. బుధవారం లాసన్స్‌బే కాలనీ పోస్ట్ ఆఫీసులో జరిగిన ఈ కార్యక్రమంలో పోస్టల్ శాఖ విశాఖ రీజియన్ అసిస్టెంట్ డైరెక్టర్ డబ్ల్యూ.నాగ అదిత్యకుమార్ మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా ప్రతి ఇంటి ఆడపిల్లకు మంచి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యధిక వడ్డీ రేటును అందిస్తుందన్నారు. ఆడ పిల్ల 18 ఏళ్లు నిండే వరకు డబ్బులు జమచేస్తే తనకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులకు పథకం వివరాలతో కూడిన కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు బాధ్యతల విస్మరణ దుర్మార్గం'

- కార్పొరేటర్ గంగారావు
- ఈవోఐకు వ్యతిరేకంగా స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: ప్రజా సంపద అయిన స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం దుర్మార్గమని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీఐటీయు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. ఇటీవల ఉక్కు యాజమాన్యం ముడిసరకు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ప్రకటన చేయడానికి నిరసనగా స్టీల్ సీఐటీయూ మిత్రపక్షాల ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు పరిపాలన భవనం కూడలి వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలంటూ యాజమాన్యం స్థానిక కార్మిక సంఘాలతో చర్చించకుండా ప్లాంట్ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసేలా నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలు కేంద్ర ఉక్కుశాఖా మంత్రికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. యాజమాన్యం వెంటనే ఆ ప్రతిపాదనను విరమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.టి. దాస్, మిత్రపక్షాల నాయకులు డి.వి. రమణారెడ్డి, డి. సురేష్‌బాబు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఏయూ క్యాంపస్: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని డిప్యూటీ కలెక్టర్ జె.మాధవి అన్నారు. బుధవారం ఏయూ ఫార్మసీ కళాశాల సమావేశ మందిరంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతరం ఆరోగ్య జీవనం అలవరచుకోవాలని సూచించారు.

ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ 'సే నో టు డ్రగ్స్'అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. యువత పెడతోవ పట్టకుండా వారిలో మంచి ఆలోచనలు పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ 14500 ఏర్పాటు చేసి యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచే ప్రయత్నం చేస్తోందన్నారు. ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్, ప్రభుత్వ మానసిక వైద్యశాల వైద్యులు డాక్టర్ కె.ప్రభాత్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ ఎల్. మాధవి, ఎక్సైజ్ విభాగం ఎస్ఐ జి.రాజేశ్వరి, ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.శైలజ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మాధవి

ఫెర్రో పరిశ్రమలను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఫెర్రో అల్లాయిస్ ఉత్పత్తి దారుల అసోసియేషన్ అధ్యక్షుడు షరఫ్

దాబాగార్డెన్స్: ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫెర్రో అల్లాయిస్ ఉత్పత్తిదారుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌కే షరఫ్ కోరారు. నగరంలోని ఓ హోటల్లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ దేశాల్లోని ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్ యూనిట్ రూ.3 కంటే తక్కువకే లభిస్తుందన్నారు. మన దేశంలో కూడా పలు రాష్ట్రాల్లో విద్యుత్ చౌక ధరకే లభిస్తున్నందున అక్కడి ఫెర్లో అల్లాయి పరిశ్రమలు వాటి మనుగడను నిలబెట్టుకుంటున్నాయని చెప్పారు. ఫెర్రో ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు అత్యంత అవసరమైన ముడి పదార్థం విద్యుత్ సరఫరా అని, ఉత్పత్తి ఖర్చులో ఆయా ఫెర్రో అల్లాయ్ స్వభావాన్ని బట్టి 35 నుంచి 70 శాతం ఖర్చు విద్యుత్ కొనుగోలుకు వెచ్చిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫెర్రో అల్లాయ్ పరిశ్రమలను ప్రత్యేక తరగతికి చెందిన పరిశ్రమగా గుర్తించి ఎన్‌టీపీసీ నుంచి విద్యుత్ సరఫరా కేటాయింపులు చేయాలన్నారు. రాష్ట్రంలో 39 ఫెర్రో అల్లాయి పరిశ్రమలుండగా.. 33 యూనిట్లు 700 ఎంవీఏ పైగానే కాంట్రాక్టెడ్ ఎండీతో నడుస్తూ 40 వేల మంది కార్మిక కుటుంబాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

వృక్షశాస్త్ర విభాగం సందర్శన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విభాగంలో ఉన్న వివిధ మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు స్వయంగా అభివృద్ధి చేస్తున్న పలు మొక్కలతో కూడిన నర్సరీ ని పరిశీలించారు. విద్యార్థులను అడిగి మొక్కల వివరాలు, ప్రత్యేకతలు, వాటిని పెంచే విధానం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడు తూ విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే విధంగా కృషి చేయాలని సూచించారు. వర్సిటీలో నూతనంగా నిర్మించే పలు భవనాల వద్ద సుందీకరణ, మొక్కలు నాటే కార్యక్రమంలో విలువైన సూచనలు వృక్షశాస్త్ర విభాగం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.రత్నకుమార్, బ్యూటిఫికేషన్ విభాగం డీన్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

సీఎంఎం విభాగాధిపతికి అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధిక ఉత్పత్తి సాధించే దిశగా ఉద్యోగులందరూ శ్రమించాలని స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ మెయింటెనెన్స్ మెకానికల్ (సీఎంఎం) జనరల్ మేనేజర్ గణేష్‌కుమార్ కోరారు. సీఎంఎం నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు ఆయనను కలిసి శాలువా కప్పి, బొకేతో అభినందించారు.